

అంకురార్పణతో విజయదుర్గాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విద్యుత్ దీపకాంతులతో వెలుగొందుతున్న ఆలయ ముఖద్వారం

కడప(కల్చరల్), ఫిబ్రవరి 22: నగర బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజులపాటు జరుగనున్నట్లు వెల్లడించారు. వేదపండితులు రాయపద్ది సుబ్బరామశర్మ శిష్య బృందం, ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, యాగశాలలో ద్వార దేవతా ఆవాహన, మండపారాధనలు, ప్రధాన కళశస్థాపన, వాస్తు పూజాది కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. 23వ తేదీ శుక్రవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, చండీహోమం, సుమంగళిపూజ, కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. కావున భక్తులు అమ్మవారి ఉత్సవాలలో పాల్గొని విజయ దుర్గమ్మ ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయం రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో దేదీప్యమానంగా ప్రకాస్తోంది.



ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, మల్లికార్జునరావు

నా భర్త ప్రాణాలకు ఎమ్మెల్యేతో ముప్పు

- వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి ఎస్పీకి ఫిర్యాదు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 22: నా భర్త జంబాపురం రామాంజనేయరెడ్డి (మాజీ కౌన్సిలర్) కి ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డితో ప్రాణహాని వుందని వైసీపీకి చెందిన 3వ వార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం వారు కడపలోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఎస్పీని కలిసి ఎమ్మెల్యేపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 19న సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డితో పాటు 10వ వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, వైసీపీ నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి మరికొందరు మా ఇంటిలోకి రాబోయారని.. మా భర్త రామాంజనేయరెడ్డి లేడని వచ్చాక రండి మాట్లాడదామని చెప్పినా వినకుండా గేటు తోసుకోని లోపలకు వచ్చారన్నారు. నేను వద్దని వారించినా గౌరవం లేకుండా మాట్లాడారన్నారు. పార్టీ మారాలనుకుంటే పార్టీకి రాజీనామా చేసి వెళ్లాలని పరుష పదజాలంతో దుర్భాషలాడి.. నీ భర్తకు చెప్పు వాడి కాళ్లు విరగ్గొడతానని బెదిరించారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొనమని ఒత్తిడి చేశారు. నాభర్త వచ్చాక ఆయనతో మాట్లాడమని చెప్పినా వినకకుండా.. వాడికి చెప్పు వినకపోతే శాల్తీ లేచిపోతుందని బెదరించి వెళ్లారని తెలిపారు. దీంతో నా భర్త జంబాపురం రామాంజనేయరెడ్డికి ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డితో ప్రాణహాని వుందని.. నా భర్తకు ఏమి జరిగినా అందుకు ఎమ్మెల్యే పూర్తి బాధ్యత వహించాలని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు వెంట వచ్చి బెదిరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.



వైసీపీకి కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి, భర్త రామాంజనేయరెడ్డి (ఫైల్)

ఎవరు బాధ్యులు..?

- వైవీయూలో విద్యార్థులకు అస్వస్థత
- క్యాంపస్‌లోనే వైద్య చికిత్సలు
- ఆరోగ్యం విషమించడంతో రిమ్స్‌కు తరలింపు
- అధికారులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు



రిమ్స్‌లో చికిత్సలు పొందుతున్న విద్యార్థులు

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 22: యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. అయితే అధికారులు విషయం బయటికి పొక్కనీయలేదు. క్యాంపస్‌లోనే ఉంచి చికిత్స అందించారు. విద్యార్థి సంఘాలు ప్రశ్నించినా అదేమీ లేదంటూ కొట్టిపారేశారు. చివరకు కొందరు విద్యార్థుల పరిస్థితి విషమించడంతో హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. ఈ సంఘటనపై జిల్లా అధికారులు విచారణ జరుపుతున్నారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని క్యాంపస్ అధికారులపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కడప నగరం యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పలువురు పీజీ విద్యార్థులు బుధవారం రాత్రి వసతిగృహంలో భోజనం చేసిన తరువాత కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అక్కడ అధికారులు విషయం ఎవరికీ చెప్పకుండా క్యాంపస్‌లోనే వారికి వైద్యసేవలు అందించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకు గోప్యత ప్రదర్శించారంటూ విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కలుషిత ఆహారం భుజించడం వల్లనే అస్వస్థకు గురయ్యారని తెలుస్తోంది. వైవీయూ హాస్టల్‌లో ప్రతిరోజూ విద్యార్థులు రాత్రి 7.30 నుంచి 9.30 గంటల మధ్య భోజనం చేస్తారు. ఎప్పటిలాగే బుధవారం రాత్రి భోజనంలో అన్నం, వంకాయ కూర, రసం, పెరుగును విద్యార్థులు భుజించారు. 10.30 గంటల ప్రాంతంలో విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. 11 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురి కాగా వైవీయూ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి అత్యవసర విభాగంలో వైద్యసేవలు అందించారు. అయితే వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండడంతో రిమ్స్ వైద్యుల సూచనల మేరకు కడప నగరం సన్‌రైజ్ హాస్పిటల్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. రాత్రి రిమ్స్‌లో చేరిన వారిని ఉదయం డిశ్చార్జి చేయగా... ఉదయం మరో 11 మంది అమ్మాయిలు అస్వస్థతకు గురి కావడంతో వారిని కూడా రిమ్స్‌కు తరలించి వైద్యం అందిస్తున్నా రు. కాగా, అస్వస్థతకు గురైన విద్యార్థులను వైవీయూ వైస్‌ఛాన్సలర్ సుధాకర్, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి రిమ్స్‌లో కలిసి పరామర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడున్న డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు రిమ్స్ కు చేరుకుని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

-ఎస్.గోవర్ధనరెడ్డి,
వైవీయూ మాజీ పాలక మండలి సభ్యుడు



ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన వైవీయూ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి. ప్రభుత్వమే విద్యార్థులకు వైద్యం కోసం అయ్యే ఖర్చు భరించాలి. జరిగిన సంఘటనకు గల కారణాలు తెలుసుకుని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. వైవీయూ అధికారులు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలి.

అస్వస్థతకు కారణాలపై అధికారుల ఆరా..

వైవీయూ విద్యార్థుల అస్వస్థతకు గురైన విషయాన్ని వైవీయూ అధికారులు గోప్యంగా ఉంచడంపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. కలెక్టరు విజయరామరాజు, ఆర్డీవో, ఎమ్మార్వోలు విద్యార్థులు అస్వస్థతకు గురి కావడానికి గల కారణాలపై వైవీయూ అధికారులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్యం అందించాలని వైవీయూ అధికారులతో పాటు రిమ్స్ అధికారులకు కూడా సూచించారు. అస్వస్థతకు గల కారణాలు తెలుసుకుని ఆహారాన్ని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

ఆహారం, నీరు పరిశీలనకు పంపిస్తున్నాం

- చింతా సుధాకర్, వైవీయూ వైస్ ఛాన్సలర్



విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలు తెలుసుకునేందకు విద్యార్థులు భుజించిన ఆహారాన్ని, విద్యార్థులకు సరఫరా చేస్తున్న నీటిని కూడా పరిశీలనకు పంపిస్తున్నాం. అయితే క్యాంపస్‌లో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేశామని... తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదు, ఆహారంలో ఏమైనా తేడా ఉంటే అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. దీనిపై కలెక్టరు, ఎమ్మార్వోతో మాట్లాడామని.. వారి సహకారంతో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాం.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

- ఆర్వీఎస్ రాష్ట్రకార్యదర్శి మల్లెల జగదీష్

వైవీయూ వసతి గృహం లో ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థుల్లో ఏ ఒక్క విద్యార్థికి ప్రాణనష్టం కలిగినా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం వైవీయూ క్యాంపస్‌లో విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. భోజనం సరిగా లేని కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. దీనిపై కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.



వైవీయూ క్యాంపస్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు



విద్యార్థులను పరామర్శిస్తున్న వీసీ, ప్రిన్సిపల్



విద్యార్థులకు వైద్యం చేస్తున్న డాక్టర్లు

వరికి న(క)ష్టకాలం

- 10 మండలాల్లో ఎండుతున్న వరి
- ఠారెత్తిస్తున్న ఎండలు
- ఎండిపోతున్న చెరువులు, కుంటలు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- ఆందోళనలో అన్నదాతలు

కడప(రూరల్), ఫిబ్రవరి 22: జిల్లాలో వరి సాగుకు న(క)ష్టకాలం దాపురించింది. తీవ్రమైన వర్షాభావ పరిస్థితులకు తోడు గత వారం రోజుల నుంచి ఎండలు మండుతుండడంతో అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. జిల్లాలోని దాదాపు 10 మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి కారణంగా వందల ఎకరాలలో వరి పంట ఎండుముఖం పట్టింది. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా 2023-24 రబీలో 10,669 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం కాగా.. వర్షాభావ పరిస్థితుల కారణంగా 8,132 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఇందులో అధికశాతం బోరు బావులు, పంట కాలువలు, చెరువుల కింద వరి పంట సాగు చేశారు. సాగు తరువాత రబీలో కనీస వర్షపాతం కూడా నమోదు కాలేదు. కొన్ని మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో పెద్దముడియం, రాజుపాలెం, ప్రొద్దుటూరు, చాపాడు, ఖాజీపేట, వల్లూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, కమలాపురం తదితర మండలాల్లో సాగైన వరి పంట పరిస్థితి అధ్వానంగా తయారైంది. బోర్లు, చెరువుల్లో నీళ్లు అడుగంటి పోయి పంటకు తగిన స్థాయిలో నీరందక బెట్టగిల్లుతోంది. దీనికి తోడు గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో తీవ్రమైన నీటిఎద్దడి నెలకొంది. దీంతో సాగు చేసిన పంట కళ్లేదుటే ఎండిపోతుండడంతో రైతులు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టా డుతున్నారు. పెట్టిన పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా వరి సాగు వివరాలు...

ఖాజీపేట మండలలో 894.4 హెక్టార్లకు గాను 554, చెన్నూరులో 856.4 హెక్టార్లకు 675, కడపలో 120.2 హెక్టారకు 234, చింతకొమ్మదిన్నెలో 123 హెక్టార్లకు 145, పెండ్లిమర్రిలో 288 హెక్టార్లకు 398, ఒంటిమిట్టలో 112.8 హెక్టార్లకు 101, బి.మఠంలో 512.6 హెక్టార్లకు 296, ఎస్.ఎ. కాశినాయనలో 71.2 హెక్టార్లకు 66, కలసపాడులో 254.8 హెక్టార్లకు 181, పోరుమామిళ్లలో 368.4 హెక్టార్లకు 383, బి.కోడూరులో 482.4 హెక్టార్లకు 286, చాపాడులో 967.8 హెక్టార్లకు 512, దువ్వూరులో 418.2 హెక్టార్లకు 118, మైదుకూరులో 427.6 హెక్టార్లకు 73, రాజుపాలెంలో 193.2 హెక్టార్లకు 65, వీఎన్ పల్లెలో 44.8 హెక్టార్లకు 09, ఎర్రగుంట్లలో 285.4 హెక్టార్లకు 639, కమలాపురంలో 247.2 హెక్టార్లకు 185, వల్లూరులో 535.2 హెక్టార్లకు 443, మైలవరం 141 హెక్టార్లకు 72, పెద్దముడియంలో 54.4 హెక్టార్లకు 24 హెక్టార్లలో వరి పంట సాగైంది. అలాగే ప్రొద్దుటూరులో 698.4 హెక్టార్లకు 301, జమ్మలమడుగులో 589 హెక్టార్లకు 649, లింగాలలో 33.8 హెక్టార్లకు 01, వేంపల్లెలో 169.6 హెక్టార్లకు 291, చక్రాయపేటలో 249.8 హెక్టార్లకు 163, బద్వేల్‌లో 457.6 హెక్టార్లకు 250, గోపవరంలో 372.4 హెక్టార్లకు 199, అల్లూరులో 203.6 హెక్టార్లకు 69, సిద్దవటంలో 481.8 హెక్టార్లకు 619, కొండాపురంలో 79.2 హెక్టార్లకు 135, ముద్దనూరులో 12 హెక్టార్లకు 3 హెక్టార్లలో వరి పంటను సాగుచేశారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

జిల్లాలో సాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో వరి పంటను సాగు చేసిన రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగు జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని పెద్దముడియం, రాజుపాలెం, ప్రొద్దుటూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, వల్లూరు, మైదుకూరు, పోరుమామిళ్ల, కమలాపురం మండలాలోని పలు గ్రామాల్లో 30, 40 రోజుల వరి పంటకు తగిన నీరు అందుబాటులో లేక ఎండిపోతున్నట్లు వ్యవసాయశాఖ దృష్టికి వచ్చిందన్నారు. ప్రధానంగా జై శ్రీరామ్ వెరైటీలో ఇది ఎక్కువగా కనిపిస్తోందన్నారు. ఈ మేరకు రైతులు పోలంలో రెండు సెంటీమీర్ల వరకు నీటిని నిల్వ ఉంచుకునేలా చూడాలన్నారు.



రైతులకు నీటి తడులపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఎన్నికల నిర్వహణ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఎన్నికల అధికారులు, సహాయ అధికారులు, మాస్టర్ ట్రైనర్లకు, ఎన్నికల వ్యయంపై డివిజనల్ కో-ఆపరేటీవ్ అధికారి జె.సురేష్ అధ్యక్షతన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు నగర కమిషనరు ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నికల విధుల్లో పాల్గొని అనుభవం ఉన్న అధికారులు అదే స్ఫూర్తితో జరగనున్న ఎన్నికలను సజావుగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ అధికారులు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. మాస్టరు ట్రైనర్లు పోలింగ్ అధికారులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల ఎక్స్‌పెండేచర్ టీముల్లో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే వ్యయ పరిశీలకులు, సహాయ వ్యయ పరిశీలకులు, వీడియో సర్వైలెన్స్ టీమ్, వీడియో గ్రాఫర్స్ మానిటరింగ్ కంట్రోల్ రూమ్, వీడియో సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్వైలైన్ టీమ్, ఎక్ఛైంజ్ బృందం ప్రత్యేక పర్యవేక్షణలు చేయనున్నాయన్నారు. ఎన్నికల నియమ, నిబంధనలు తూచా తప్పకుండా అమలు జరగాలన్నారు. ఎలక్టోరల్ రోల్ ప్రక్రియ విధిగా అమలు జరగాలన్నారు. అనుమానం ఉన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా శిక్షణలో తెలుసు కోవాలన్నారు. అంతే కాకుండా రూట్ మ్యాప్, బ్యాలెట్ ముద్రణ, పోలింగ్ మెటీరియల్ సమకూర్చుకోవడం, మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ సమయంలో భద్రతా ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి తెలియ జేశారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటీవ్ అధికారి సుభాషిణి, ఆడిట్ ఆఫీసరు మంజులవాణి, ఎక్స్‌టెన్షన్ మానిటరింగ్ నోడల్ ఆఫీసరు నాగరాజు, ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

గ్రూప్-2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఈనెల 25వ తేదీ గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షలు రాసే అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమాచారం కోసం కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 08562-246344ను సంప్రదించాలన్నారు. పరీక్ష సమయానికి చేరుకోవడంలో ఇబ్బందిపడే అభ్యర్థులు ముందుగా కంట్రోల్ రూమ్‌కు ఫోన్‌చేస్తే సిబ్బంది సహకారం అందిస్తారని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

తిరగబడేదాకా తెచ్చుకోవద్దు...!

- దాడుల గురించి స్పందించే తీరిక లేదా..?
- నియంత్రించకపోతే తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తాం
- సీఎం జగన్‌కు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ హెచ్చరిక
- 'చలో అనంతపురం' ధర్నాలో కదంతొక్కిన జర్నలిస్టులు

అనంతపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరగబడేదాకా తెచ్చుకోవద్దని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని, దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి, ఇతర ప్రాంతాల్లో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ దాడులను ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ గురువారం 'చలో అనంతపురం' కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక కూడా లేదా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. సాక్షాత్తు సీఎం జగన్ సిద్ధం సభలోనే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహితంగా దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన సంఘటనను ప్రజాస్వామికవాదులందరూ ఖండించారని అన్నారు. అయినా ముఖ్యమంత్రిగాని, డీజీపీగాని ఇప్పటి దాకా నోరుమెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగమని, తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. అనంతపురం నగరంలోని సంగమేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జర్నలిస్టు సంఘాల నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కల్టెరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల నుంచి వందలాది మంది జర్నలిస్టులు తరలివచ్చారు. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఆయా పార్టీల అనుబంధ సంఘాలు, ఏపీ ఎన్జీవో, పెన్షనర్స్ అసోషియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకుల జర్నలిస్టుల నిరసనకు సంఘీభావం తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే కడప జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేసేందుకే సిద్ధం సభలు చేపట్టారా అని ప్రశ్నించారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి జర్నలిస్టులను చాలా గౌరవించేవారని, అలాంటి నేత కుమారుడై ఉండి జర్నలిస్టులపై దాడులు చేయిస్తావా అని జగన్‌ను నిలదీశారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై స్పందించని డీజీపీకి ఆ సీటులో కూర్చునే అర్హత లేదన్నారు. అనంతరం ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు.



అనంతపురంలో జరిగిన ర్యాలీలో కడప జిల్లా జర్నలిస్టులు

బీసీలను ప్రోత్సహించే ఏకైక పార్టీ టీడీపీ

● జయహో బీసీ సమావేశంలో బీటెక్ రవి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహించే ఏకైక పార్టీ తెలుగు దేశం పార్టీ అని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. గురువారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ సమావేశాన్ని ప్రైవేట్ ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని అధిష్ఠానం సూచించిందన్నారు. ఎందుకంటే బీసీలందరూ వస్తారని, తటస్థులు హాజరవుతారనే కారణంగా నిర్ణయం తీసుకుందన్నారు. అయితే పులివెందులలో ఫంక్షన్ హాల్స్‌లో సమావేశం ఏర్పాటు చేసేందుకు అవకాశం లేదన్నారు. మీ మీటింగ్‌కు బాడుగకు ఇస్తే మమ్మల్ని ఇబ్బంది పెడతారు దయచేసి ఇక్కడ పెట్టుకోవద్దని యజమానులు అంటున్నారన్నారు. అందుకే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకే సమావేశానికి మన పార్టీకి చెందిన వారే వచ్చారన్నారు.

తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అనే విధంగా పెద్దపీట వేస్తోందని తెలిపారు. మొదటి నుంచి ఎర్రన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు ఇలా అనేక మంది బీసీ నాయకులు టీడీపీలో పెద్ద పదవులు అలంకరించారన్నారు. మన తెలుగుదేశం పార్టీలో ఉన్న బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ ఎలా ప్రోత్సహించిందో అందరూ ఆలోచించాలన్నారు. వైసీపీ ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్ల ద్వారా ఒక్క బీసీకి అయినా లక్ష రూపాయల రుణం ఇచ్చిందా అని ప్రశ్నించారు. ఒకవేళ ఇచ్చి ఉంటే బీసీల గురించి మాట్లాడమన్నారు. 56 కార్పొరేషన్లకు 56 మందిని నియమించినా వారికి ఆఫీసు లేదు టేబుల్ లేదన్నారు. మరో విషయం ఏంటంటే వడ్డెరకు సంబంధించి శ్రీను అని సీఎం జగన్‌కు బాగా గుర్తుండే వ్యక్తి ఉన్నారన్నారు. అతనికి ఓ దానిలో డైరెక్టర్ పోస్టు ఇచ్చారన్నారు. అతను ఇప్పటికీ ప్రమాణ స్వీకారం కూడా చేయలేదన్నారు. అయితే నీకు టైం అయిపోయిందని ఇంటికి పంపించారన్నారు.


56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని పేపర్‌లో చెప్పుకొనేదానికి మాత్రమే అని విమర్శించారు. మన ప్రభుత్వంలో గతంలో బీసీలకు రెండు లక్షల రూపాయలు రుణం ఇచ్చి అందులో లక్ష రూపాయల సబ్సిడీని అందించామన్నారు. తద్వారా ఉపాధిని ఏర్పాటు చేసుకుని కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని మన ప్రభుత్వం చేసిందని తెలిపారు. పలువురు మాట్లాడుతూ వడ్డెరులకు ప్రమాద బీమాతో పాటు తక్షణ ఆర్థికసాయం అందించేలా పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఇంకా పలువురు తమ తమ అభిప్రాయాలను తెలియజేయగా అన్ని అంశాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని బీటెక్ రవి తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ వర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజీలో.. ఆ సార్‌దే హవా

● బస్సుల కండిషన్ గాలికొదిలేసి..

సిబ్బందిపై కస్సు బుస్సులు

● చోద్యం చూస్తున్న అధికారులు



కడప ఆర్టీసీ గ్యారేజీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 22: అది ఆర్టీసీ కడప డిపో గ్యారేజీ. అక్కడ బస్సుల కండిషన్ బాగాలేని వాటిని సరిచేసి తిరిగి రోడ్డుపై ప్రయాణికుల సేవలో సవ్యంగా నడిచేలా మరమ్మతులు జరుగుతుంటాయి. సుమారు వంద మందికి పైగా మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు రాత్రీపగలూ తేడా లేకుండా బస్సుల కండిషన్ మెరుగుపరచేందుకు షిఫ్టుల వారిగా పనిచేస్తుంటారు. వారంతా సవ్యంగా విధులు నిర్వహించేలా మెకానిక్‌లను అజమాయిషీ చేసేందుకు వీలుగా గ్యారేజీలో ఓ సార్ (డిప్యూటీ సూపరింటెంటెంట్ మెకానిక్) ఉంటారు. ఈయన అంతా తానే అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. ఆ సార్ చెప్పిందే వేదం, చేసిందే శాసనం. అక్కడి కిందిస్థాయి మెకానిక్‌లను, అలాగే సూపర్‌వైజర్లను కూడా లెక్కలేని తనంతో దుర్భాషలాడడం... తూలనాడడం నిత్యం పరిపాటిగా మారిందని పలువురు మెకానిక్‌లు లోలోన మధనపడుతున్నట్లు సమాచారం. పైపెచ్చు అంతా ఆ సార్ తనకే తెలుసన్నట్లుగా రుబాబు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతలా ఆ సార్ హవా అక్కడ సాగడానికి కడప డిపో అధికారి ఆశీర్వాదాలున్నట్లు డిపోలో పలువురు చర్చించుకుంటున్నారు.

జిల్లా కేంద్రమైన కడప డిపోలో సుమారు 100 పైచిలుకు వివిధ రకాల (పల్లెవెలుగు, డీలక్స్, అల్ట్రాడీలక్స్, సూపర్‌లగ్జరీ, ఇంద్ర, అమరావతి) బస్సులున్నాయి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా బస్సుల కండిషన్‌ను మరింతగా మెరుగుపరిచే పనులను గ్యారేజీలో చేస్తుంటారు. బస్సుల కండిషన్, పరిశుభ్రత పట్ల శ్రద్ధచూపాల్సిన బాధ్యతను ఆ సార్ గాలికొదిలేసి మెకానిక్‌ల పట్ల కస్సు బుస్సుల పర్వానికే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారనే విమర్శలున్నాయి. ఒక్కోసారి ప్రయాణికులను తీసుకెళ్లే క్రమంలో బస్సులు మార్గమధ్యంలో చెడిపోయి నిలిచిపోయిన సందర్భాలున్నాయి. అలా జరగకుండా ఆయా బస్సుల కండిషన్‌ను ముందస్తుగా చెక్ చేయాల్సిన బాధ్యత గ్యారేజి మెకానిక్‌లపై ఉందనే నెపంతో ఆ సార్ మెకానిక్‌ల పరుష పదజాలంతో దూషిస్తున్నట్లు సమాచారం.

ఇదిలావుండగా కడప డిపోతో పాటుగా గ్యారేజీలో వివిధ యూనియన్లకు చెందిన ఉద్యోగులు, మెకానిక్‌లు సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. వారిలో ఒక యూనియన్ మెకానిక్‌లకు వత్తాసు పలుకుతూ మిగతా యూనియన్ మెకానిక్‌ల పట్ల చిరాకుతో వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో గ్యారేజీ మెకానిక్‌లు ఆ సార్ వ్యవహారంతో ఇబ్బంది పడుతున్నారని సమాచారం. ఏది ఏమైనా గ్యారేజీలో ఆ సార్ వ్యవహరిస్తున్న తీరుపట్ల పైస్థాయి అధికారులు దృష్టి సారించి తమకు ఇబ్బందులు కలగకుండా చూడాలని గ్యారేజీ మెకానిక్‌లు కోరుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

● డీపీవో ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీపీవో ప్రభాకర్‌రెడ్డి

కడప (రూరల్) ఫిబ్రవరి 22 : పంచాయతీ శాఖ ద్వారా సాధించాల్సిన ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక అధికారి అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులను చేపట్టాలని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణంలోని డీపీవో కార్యాలయంలో గురువారం ఆయా మండల ఈవోపీఆర్‌డీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 15వ ఆర్థిక ఫైనాన్స్ నిధులకు సంబంధించి ప్రగతి నివేదికను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పంచాయతీశాఖ ద్వారా చేపట్టాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన ప్రగతి నివేదికల మేరకే అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికను మండల పరిషత్తుశాఖలు ఈనెల 29వ తేదీ లోపు, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికను మార్చి 31లోపు ఈ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో తప్పక నమోదుచేయాలన్నారు. రాజ్యాంగంలోని 243 జి ఆర్టికల్ ప్రకారం పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించి వాటి ద్వారా ప్రజల ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధించడానికి తగిన ప్రణాళికలను తయారు చేయాలని ప్రభుత్వాలు ఆదేశించాయన్నారు. వీటిలో పేదరికంలేని మెరుగైన జీవనోపాధుల గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, నీటి సౌకర్యం కలిగిన గ్రామం, పారిశుధ్యం, పచ్చదనం కలిగిన గ్రామం, స్వయం సమృద్ధితో కూడిన మౌళిక సదుపాయాలు కలిగిన గ్రామం, సామాజిక న్యాయం, భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలనతో కూడిన గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం తదితర అంశాలున్నాయన్నారు.

వీటికి సంబంధించిన వివిధ స్థాయిలలో ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ప్రణాళికలను తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఖాదర్‌బాషా, కడప డీఎల్‌పీవో ఎస్.మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 22: మండలంలోని ఉరుటూరు గ్రామ సమీపంలో ఉన్న సత్రం వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో వేంపల్లెకు చెందిన షేక్ సాజిబాబా (24) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వేంపల్లె నుంచి నాలుగుచక్రాల ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా సత్రం వద్దకు చేరుకున్న సమయంలో సత్రాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇతను వీరపునాయునిపల్లెలో చికెన్ సెంటర్ నిర్వహిస్తుండేవాడు. పనినిమిత్తం ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి భార్య ఉన్నారు. సాజిబాబా మృతితో ఆయన కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.


దళితుడిపై వైసీపీ నాయకుల దాడి, తీవ్రగాయాలు



గాయపడిన జయన్న

అట్లూరు, ఫిబ్రవరి 22 : అట్లూరు మండలం మన్నెంవారిపల్లె వైసీపీ నాయకులు మన్నెం తిరుపతిరెడ్డి, మన్నెం రామనాథరెడ్డి, సుభద్రమ్మ, దిన్నెమీదపల్లె దళిత కాలనీకి చెందిన జయన్నపై మంగళవారం రాత్రి కర్రలతో దాడి చేయగా తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోహన్ బాబు తెలిపారు. మంగళవారం రాత్రి తన పొలం వద్ద ఉన్న పైపులు కనిపించకపోవడంతో ఎవరు దొంగిలించారోనని జయన్న తిడుతున్నారు. అక్కడే పక్క పొలంలో ఉన్న తిరుపతిరెడ్డి, రామనాథరెడ్డి, సుభద్రమ్మ ఎవర్నిరా నువ్వు తిట్టేది అంటూ తనపై దాడి చేసి చెప్పులతో కొట్టి గాయపరచినట్లు జయన్న పేర్కొన్నారు. పక్కనే ఉన్న కాలనీవాసులు, బంధువులు అక్కడకి చేరుకుని హుటాహుటిన 108 ద్వారా బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ బద్వేలు వైద్యాధికారులు మెరుగైన చికిత్స కోసం బుధవారం కడప రిమ్స్‌కు తరలించినట్లు జయన్న బంధువులు తెలిపారు.

పద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 22 : తిరుపతి శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం తెలుగుశాఖ బోర్డ్ ఆఫ్ ఛైర్మన్‌గా వైవీయు తెలుగుశాఖ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తుండిన కొలకలూరి మధు, జ్యోతి, ద్రవిడ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డిని పద్మావతి మహిళా యూనివర్శిటీ తెలుగుశాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులుగా నియమించారు. ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల తెలుగు పాఠ్య పుస్తక రచయితగా పది సంవత్సరాల పాటు సేవలందించారు.

వైసీపీ నాయకులు వేధిస్తున్నారంటూ పోలీసులకు టీడీపీ ఫిర్యాదు

వేంపల్లె, ఫిబ్రవరి 22: వేంపల్లె ఎస్సీకాలనీలో స్థలం విషయంలో వివాదం తలెత్తింది. టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో పలువురు టీడీపీ వర్గానికి చెందిన పలువురిని పోలీసులు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పులివెందుల డీఎస్పీ వద్దకు పంపించి జాగ్రత్తగా వివాదాలకు ఆస్కారం లేకుండా పరిష్కరించుకోవాలని కౌన్సిలింగ్ ఇప్పించారు. ఈ వ్యవహారంలో వైసీపీ నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని టీడీపీకి చెందిన శేషగిరి సోదరి ఇంద్రాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు తెలిపారు. ఈ విషయాలను సీఐ చాంద్‌బాష దృష్టికి తీసుకెళ్లగా స్థలం విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని అధికారులే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ వ్యవహారంలో ఎస్సీలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం మంచిది కాదని ఇరుపార్టీల నాయకులకు సూచించారు.

స్ఫూర్తిదాయకం.. ఉయ్యాలవాడ త్యాగం

వర్ధంతి వేడుకలో పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 22: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలని పంచాయితీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించగా, ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులురెడ్డి తొలుత పాత్రికేయుడు ఫణి రచించిన రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉయ్యాలవాడ సమీప గుళ్ళదుర్తి తన స్వగ్రామమన్నారు. రాయలసీమలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు జరిపి ఉరికంబాన్ని ముద్దాడిన స్వాతంత్ర సమరయోధుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. త్యాగం, దాతృత్వాలకు ప్రతిరూపాలైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి ఒకే గ్రామానికి చెందిన వారు కావడం విశేషమన్నారు. భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ప్రొద్దుటూరు పట్టణంలో వీరిరువురి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు దారి తీసిన కీలక శ్రీభాగ్ ఒప్పందాన్ని చర్చకు రానీయకుండా తుడిచి వేయడానికి కొన్ని ప్రాంతాల నాయకులు, మీడియా ప్రయత్నాలు చేశాయన్నారు. అదే కోవలో ఏదో ఒక ముద్రవేసి నరసింహారెడ్డి చరిత్రను తుడిచి వేసేందుకు యత్నించడం విచారకరమన్నారు. రాయలసీమ చరిత్రను తుడిచి వేసే కుట్రలను ఎదుర్కోవాల్సిన అవసరముందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఇంటాక్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ సిపాయి తిరుగుబాటు పదేళ్ల ముందే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం నిర్వహించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశానికి వేగుచుక్కలా నిలిచారని కొనియాడారు. ఆయన చేసిన పోరాటం ఆ తర్వాత వచ్చిన ఉద్యమాలకు ఎంతో ప్రేరణ కల్పించిందన్నారు.

విద్యార్థులకు బహుమతులు

నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలుపొందిన నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులైన ఎస్.ఆయేషాకు ప్రథమ బహుమతి లభించగా ద్వితీయ బహుమతిని ఎస్. ఆక్సా తృతీయ బహుమతిని ఎస్. రషీద, టి. ఆఫీన్‌లకు లభించాయి. ఈ కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ నాయకులు జనార్దన్‌రాజు, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆర్పీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, కె.లింగమూర్తి, ఏపీ పాలెగాళ్ల వారసుల సంక్షేమసంఘం నాయకులు బలరామయ్య, చంద్రప్పనాయుడు, మంగమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం



మాట్లాడుతున్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

పులివెందుల, ఫిబ్రవరి 22: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ ప్రజాపోరు జిల్లా కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం పులివెందుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి మద్దతుగా, వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. మోదీ సుపరిపాలనతో దేశం అభివృద్ధిపథంలో పరుగులు తీస్తోందని, ప్రపంచమంతా మోదీ నాయకత్వాన్ని కీర్తిస్తుందన్నారు. భవిష్యత్తులో భారత్ ఆర్థికంగా మూడోస్థానంలోకి చేరి ప్రపంచపటంలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించబోతోందని తెలిపారు. అలాగే 500 ఏళ్ల నాటి అయోధ్య రామాలయ కలను మోదీ సాకారం చేయడం జరిగిందన్నారు. రక్షణ రంగంలో భారతదేశం అగ్రగామిగా నిలవడంలో మోదీ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ వర్గీయులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న దొడ్డపనేని సీఎస్ నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 22 : కమ్మ వర్గీయులంతా ఐక్యంగా ఉండాలని కడప జిల్లా కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొడ్డపనేని సీఎస్ నాయుడు కోరారు. గురువారం పట్టణంలోని దిగువబసినాయుడుపల్లెలో కమ్మ సంఘ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే కొత్త ప్రభుత్వంలో కమ్మ వర్గీయుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో తానా మాజీ ప్రెసిడెంట్ వేమన సతీష్, బెజవాడ వెంకట్రావు, రాందాసు చౌదరి, తేజశ్విని, కుసుమకుమారి, అన్నమయ్య జిల్లా కమ్మ సంఘం ప్రెసిడెంట్ శివనారాయణ చౌదరి, కిశోర్‌చౌదరి, లక్ష్మీనారాయణ, మల్లి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో చంద్రబాబునాయుడు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 22 :హైదరాబాదులో గురువారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు సమక్షంలో టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి చంద్రబాబునాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు అఫ్జల్‌ఖాన్ సోదరుడు అఫ్సర్‌ఖాన్, మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డి, ఎండీహెచ్ నవీద్ సోదరుడు మహమూద్, ఫైరోజ్, లయన్ మన్సూర్‌ఖాన్, చెన్నంశెట్టి మురళి, జావీదు, జమాల్, షఫి, షబ్బీర్. తౌసిఫ్, జనవికాస్ తాహిర్, కత్తి రవి పాల్గొన్నారు.

మాతృ మరణాలను నియంత్రించాలి: డీఎంహెచ్ఓ



కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: మాతృ మరణాలను నియంత్రించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ తన చాంబరులో మాతృమరణాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ గర్భవతులకు ప్రాథమిక స్థాయిలోనే సేవలు అందాలన్నారు. రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ సునీల్, డాక్టర్ యాదవేంద్రరెడ్డి, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన హరిప్రసాద్



కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 22 : హైదరాబాదులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించి కొన్ని విషయాలు చర్చించారు.

పంచాయతీ రాజ్ తాలూకా యూనిట్ ఎన్నిక

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీపీఆర్ఎంఈఏ) పులివెందుల తాలూకా సభ్యుల ఎన్నికలు గురువారం నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభావనంలో పులివెందుల డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.సురేంద్రనాథ్ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ కె.సురేంద్రనాథ్ ఎన్నికకాబడ్డ సభ్యుల వివరాలను వెల్లడించారు. ఏపీపీఆర్ఎంఈఏ తాలూకా ప్రెసిడెంట్‌గా వై.శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్‌గా పి.నాగమల్లికార్జున, జనరల్ సెక్రటరీగా ఏ.రాజేంద్ర, జాయింట్ సెక్రటరీగా సి.వెంకట రమేష్‌రెడ్డి, ట్రెజరర్‌గా జి.మామహేశ్వరి, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్-1గా టి.జనార్దన్‌బాబు, డిస్ట్రిక్ట్ కౌన్సిలర్-2గా ఎస్.మోహన్ శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు డీఎల్‌డీఓ తెలిపారు.

కడపవాసికి అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ స్రవంతి

కడప (మారుతీనగర్),ఫిబ్రవరి 22: వైద్య రంగంలో ప్రత్యేక ప్రతిభ మహిళా ఆర్థో డాక్టర్లకిచ్చే అంతర్జాతీయ అవార్డును దుబాయి దేశ అబుదాబి నగర మెడియార్ హాస్పిటల్‌లో ఆర్థో వైద్యురాలుగా సేవలందిస్తున్న కడప నగరానికి చెందిన బత్తల స్రవంతి గురువారం దుబాయ్ నగరంలో అందుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం కడప జిల్లా అధ్యక్షుడు, పూలే సేవా అవార్డు గ్రహీత బత్తల లింగమూర్తి కుమార్తె బత్తల స్రవంతి గత మూడు సంవత్సరాలుగా అబుదాబి మెడియార్ హాస్పిటల్‌లో ఆర్థో వైద్యురాలిగా విశేషసేవలందిస్తూ హెల్త్ 2.0 కాన్ఫరెన్స్ విభాగంలో అవార్డు రావడం ఆనందదాయకమని కుటుంబసభ్యులు, వైద్యులు తెలిపారు.

'బాడీ బిల్డింగ్ పోటీలను జయప్రదం చేయండి'

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 22: బాడీ బిల్డింగ్ పోటీలను విజయవంతం చేయాలని స్టేట్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ షేక్ న్యాయతుల్లా పేర్కొన్నారు. గురువారం కడప గోకుల్ సర్కిల్ వద్దగల స్వర్గీయ షంషీరుద్దీన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ట్రెజరర్ ఇంతియాజ్‌ఖాన్, కడప బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రసిడెంట్ తారిఖ్‌అలి, వైస్ ప్రసిడెంట్ అన్వర్ అలీజైన్ సెక్రటరీ ముక్తియార్, సభ్యులు ఖాజా బాష, హర్షద్, నాగార్జున నూర్‌బాష, నటరాజ్, రెహమాన్ పాల్గొన్నారు.

'టీడీపీ నుంచి వైసీపీలో ఎవరూ చేరలేదు'

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 22 : వైసీపీ వారికే కండువాలు వేసుకుని టీడీపీ నుంచి చేరారంటూ చెప్పడం ఎమ్మెల్యే స్థాయికి తగదని అతిదెన ఓబాయపల్లె సర్పంచ్ ఓబులేసు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో 10 సంవత్సరాల నుంచి ఉన్న వాళ్లను ఎమ్మెల్యే ఇంటికి పిలుచుకునిపోయి పాతవాళ్లకే కండువాలు వేసి టీడీపీ నుంచి పార్టీలో చేరారని చెప్పడం హాస్యాస్పదమన్నారు. అలిదిన్నెవాసుదేవరెడ్డి ఎమ్మెల్యే మెప్పు పొందడం కోసం దిగజారి రాజకీయాలు చేయడం అందరూ గమనిస్తున్నారన్నారు. మా పంచాయతీలో టీడీపీ వాళ్లను మీ పార్టీలో చేర్చుకున్నామని చెప్పుకోవడం దారుణమన్నారు. ఓబులేసు, ఉత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


కార్యక్రమంలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి

చెన్నూరు, ఫిబ్రవరి 22: మాతంగి శ్యామలాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం మండలంలోని గోపవరం గ్రామ సమీపంలోని పుష్పగిరి రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం జరిగింది. పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకర భారతిస్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో అమ్మవారి విగ్రహాన్ని నిర్మించాలని ప్రజలు కోరడంతో చెన్నూరుకు చెందిన బోలా వెంకటసుబ్బయ్య, సుధాకర్, రవికుమార్‌మహేశ్వర్‌రెడ్డి, శివశంకర్, వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయ నిర్మాణం పూర్తి కాగా గురువారం విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. చెన్నూరు మండలంతో పాటు ఖాజీపేట, వల్లూరు, కడప తదితర మండలాల నుండి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. బండలాగుడు పోటీల్లో ప్రథమ బహుమతిని మార్తల వెంకటసుబ్బారెడ్డి, ద్వితీయ కుందూరురాంభూపాల్‌రెడ్డి, తృతీయ బహుమతి శ్రీనివాసులరెడ్డి, నాలుగవ బహుమతి జతీన్‌విహాన్ అందుకున్నారు. అలాగే మొత్తం 29 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అలాగే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా అమ్మవారిని దర్శించున్నారు.

అందరి అభివృద్ధే టీడీపీ ధ్యేయం

- పుత్తా, సీఆర్సీ సమక్షంలో కొండపేటలో 200 కుటుంబాలు చేరిక


పుత్తా, సీఆర్సీ సమక్షంలో టీడీపీలో చేరినవారు

చెన్నూరు, ఫిబ్రవరి 22 : అందరి అభివృద్ధే టీడీపీ ధ్యేయమని టీడీపీ రాష్ట్రఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రయ్య అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కొండపేట గ్రామంలో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి టీడీపీని ఆదరించి ఈ ఎన్నికల్లో మెజార్టీ అందించి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. పుత్తా నరసింహారెడ్డి మంచి నేత అని, ఆయన్ను ఎన్నుకుంటే కమలాపురం నియోజకవర్గం అభివృద్ధిపథంలో ముందుకు దూసుకెళుతుందన్నారు.

టీడీపీలో 200 కుటుంబాలు చేరిక

కొండపేటలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో 200 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఆ ప్రాంత కాపు యువనేతలు గుడిపాటి మనోజ్, జింకా శివ, సునీల్ ఆధ్వర్యంలో దాదాపు వంద కుటుంబాలు, 30 యాదవుల కుటుంబాలు, బాలుడు, రమేష్, ఆధ్వర్యంలో, మడతల నాగిరెడ్డి అనే రైతు ఆధ్వర్యంలో పది కుటుంబాలతో పాటు ఇతర ఓసీ కుటుంబాలు బీసీ కుటుంబాలు మొత్తం వంద కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కండువా వేసి ఆహ్వానించారు. మండల కన్వీనరు కె.విజయభాస్కర రెడ్డి, కొండపేట మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బలిజ సంఘం నేత రవిశంకర్, చవాన్‌రెడ్డి, బేల్దారి బాలక్రిష్టారెడ్డి , ఉండేల గుర్విరెడ్డి, సుబ్బరాయుడు, సంజీవ్‌పవన్, బాషు, నన్నేసాబ్ మాబు, గౌస్, పి.సుబ్బారెడ్డి, రైతు నేతలు విజయభాస్కర్‌రెడ్డి, లేవాకు విజయప్రతాప్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అండగా నిలవండి: బీటెక్ రవి


వేంపల్లెలో బీటెక్ రవి సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు యువకులు

వేంపల్లె, ఫిబ్రవరి 22: తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రజలను కోరారు. వేంపల్లెలోని పుల్లయ్యతోట, గండిరోడ్డు తదితర ప్రాంతాలలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలిశారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా ప్రాంతాల్లో పలువురు యువకులు టీడీపీలో చేరారు. బీటెక్ రవి కండువా వేసి ఆహ్వానించారు. సురేష్, వెంకటేష్, హుసేన్‌పీర, ప్రసాద్ తదితర పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనను అంతమొందించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం రాష్ట్రానికి ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరెడ్డి, షబ్బీర్, దర్బార్, మడక శ్రీనివాసులు, మహమ్మద్, అల్లాబకాష్, మహబూబ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవుడు

వల్లూరు, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో కొలువై ఉన్న రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన గురువారం అంకురార్పణతో ప్రారంభమ య్యాయి. రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామితో పాటు దేవతామూర్తులను వేద పండితుల వేద మంత్రాల నడుమ ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకు డు గోపూజ నిర్వహించి స్థల దేవతా ప్రార్థన అనం తరం యాగశాల ప్రవేశాన్ని నిర్వహించారు. అనంతరం మహాసంకల్పంతో శుద్ధి పుణ్యహావాచనాన్ని వేద పండితులు నిర్వహించారు. ధ్వజారోహణ అనంతరం హోమాలను చేపట్టారు. ముఖ్యంగా సుదర్శన రాక్షసోగ్న హోమాలతో పాటు వాస్తుహోమాలను వివిధ హోమాలు నిర్వహించిన అనంతరం అఘోర రుద్ర సుదర్శన పారాయణం, లలిత, లక్ష్మీవిష్ణు సహ్రస నామా పారాయణాన్ని వేద పండితులు నిర్వహించారు. అనంతరం సహ్రస మోదక అనంతనాగ విజయగణపతి హోమాలతో పాటు ఆదిత్య హోమం, దత్తాత్రేయ దక్షిణామూర్తి హోమం, నక్షత్ర నవగ్రహ సుదర్శన హోమాలతో పాటు పుత్రకామేష్టి యాగాన్ని వైభవంగా వేద పండితులు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం మంగళహారతి ఇచ్చి మహాప్రసాదాన్ని భక్తులకు హరినారాయణ అందించారు. సాయంత్రం 4 గంటల నుంచి వేద పారాయణం నిర్వహించి చండీ పారాయణాన్ని మహామంగళహారతిని స్వామివారికి నివేదించి తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కోలాటాలతో పాటు హైదరాబాదు వాస్తవ్యులచే నాట్య, కోలాట ప్రదర్శన నిర్వహించారు. రాత్రి 9 గంటలకు పండుగ భజన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తరించారు. నేడు సుబ్రమణ్య హోమంతో పాటు సువర్చల దేవి సమేత హనుమాన్ కల్యాణం చేపడతామని ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

బీజేపీ నిరంకుశ పాలన నశించాలి

- కడపలో రైతు, కార్మిక సంఘాల నేతల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘాల నేతలు

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 22 : రైతాంగం పట్ల నరేంద్ర మోదీ నిరంకుశ పాలన నశించాలని రైతు, కార్మిక సంఘాల నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు గురువారం కడప పాత బస్టాండు పూలే సర్కిల్‌లో నిరసన నిర్వహించారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, భాస్కర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా గతంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. అందుకు నిరసనగా రైతాంగం శాంతియుతంగా రెండో విడత ఢిల్లీకి పోతుంటే బీజేపీ ప్రభుత్వం రైతుల పట్ల కాల్పులు జరిపి పోలీసులచే దాడి చేయించడం దారుణమన్నారు. రైతు శుభ్‌కిరణ్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం బలి తీసుకుందన్నారు. రైతు ఉద్యమం పట్ల నరేంద్ర మోదీ ప్రభుత్వ నిరంకుశత్వాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రైతులు పండించే అన్ని పంటలకు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ శివారెడ్డి, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు వెంకటశివ, రామ్మోహన్, రైతు సంఘాల నాయకులు శేఖర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సావంత్ సుధాకర్, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, విద్యార్థి యువజన సంఘాల నాయకులు చంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

ఫుడ్‌పాయిజన్ విద్యార్థులను పట్టించుకోని వైవీయూ అధికారులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 22 : వైవీయులో ఫుడ్‌పాయిజన్‌కు గురైన విద్యార్థులను వైవీయు అధికారులు పట్టించుకోవడంలేదని పీడీఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న ఆరోపించారు. గురువారం పీడీఎస్‌యు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. క్యాంపస్‌హాస్టల్‌లో సంవత్సరాల తరబడి సమస్యలు ఉన్నాని, పరిష్కరించాలని విద్యార్థులు అడుగుతున్నా నామమాత్రంగా స్పందించడం తప్ప ఎటువంటి పరిష్కార మార్గాలు చూపలేదన్నారు. పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి శ్రీనాద్‌యాదవ్, నగర కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందేలా చూడాలి: బీజేవైఎం

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 22: యోగివేమన యూనివర్సిటీ హాస్టల్ సిబ్బంది నిర్వాకం వల్లే అక్కడి విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని, తక్షణమే రిమ్స్ వైద్యులు స్పందించి మెరుగైన వైద్యసేవలందించేలా చూడాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి బి. పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ కోరారు. గురువారం రిమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న విద్యార్థినులను వారు పరామర్శించి మాట్లాడారు.

కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఆర్వీఎస్ జిల్లా కార్యదర్శి హరిత డిమాండ్ చేశారు. వారిని పరామర్శించారు.

విజయవాడలో కడప కాంగ్రెస్ నేతల అరెస్ట్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: దగా డీఎస్సీ వద్దు- మెగా డీఎస్సీ కావాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇచ్చిన పిలుపు మేరకు విజయవాడ పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్యను అరెస్ట్ చేయడాన్ని జిల్లా కాంగ్రెస్ నేతలు గురువారం ఖండించారు. డీఎస్సీలో అర్హులందరికీ న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. విజయవాడలో అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర జోనల్ సెక్రటరీ శ్రీనివాసుల రెడ్డి, ఉపాధ్యక్షుడు గౌస్, హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు పాలగిరిశివ, అరుణ్ కుమార్‌లు ఉన్నారు.

ప్రతి పోలీసూ కఠిన పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి


యాంటీ రయట్ డ్రిల్ పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్న పోలీసులు

కడప (క్రైం), ఫిబ్రవరి 22 : అత్యవసర సమయాల్లో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు గాను తీసుకుని వచ్చే విధంగా ప్రతి పోలీసు నిష్ణాతుడు కావాలని ఏఆర్ డీఎస్పీ మురళీధర్ అన్నారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు ఏఆర్, సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులకు స్థానిక పరేడ్ గ్రౌండ్‌లో రిఫ్రెషర్ కోర్సులో పలు ముఖ్యమైన అంశాలను వివరించారు. రాబోవు రోజుల్లో ఏమైనా సమస్యలు తలెత్తినప్పుడు సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సమస్యను అదుపులోకి తేవడానికి ప్రతి ఒక్క పోలీసు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఏఆర్ డీఎస్పీ తెలిపారు. సమస్యలు తలెత్తినప్పుడు జన సమూహంను నివారించేందుకు ఏ విధమైన సమయస్పూర్తిని వ్యవహరించాలి అనే అంశాలపై పోలీసు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. స్టోన్‌గార్డ్, హెల్మెట్, లాఠీ, టియర్ గ్యాస్ ఆయుధం మొదలైన ఇతర పరికరాలు లాఠీ డ్రిల్, మాబ్ కంట్రోల్, ఏ సమయంలో చేయాలి, సంయమనం ఎలా పాటించాలి. భాష్పవాయువు ప్రయోగాలను ఎలాంటి సందర్భాల్లో అనుసరించాలనే విషయాలపై యాంటి రయట్ డ్రిల్ లో భాగంగా పోలీసులకు మెళకువలను నేర్పిస్తున్నారు. పోలీసు సిబ్బంది శిక్షణను సద్వినియోగం చేసుకునేలా, జిల్లాలోని ప్రతి పోలీసు సిబ్బంది తర్ఫీదు పొందేలా డ్రిల్‌ను రూపొందించారు. అనంతరం ఏఆర్ డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి కఠిన పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ మాక్‌డ్రిల్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, టైటస్, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 22 : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ పీఓ వి.రమాదేవి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగిన ప్రత్యేక క్యాంపు గురువారంతో ముగిసింది. వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వయోజనులైన ప్రజలందరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు కలిగిన వారంతా ఎన్నికల్లో తమ ఓటును ఉపయోగించి సరైన నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి వజ్రాయుధం లాంటిదన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీసీ సురేంద్రనాథ రెడ్డి, వలంటీర్లకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సమాజ సేవలో పాలు పంచుకోవడం గొప్ప విషయమని, సేవ ద్వారా మాత్రమే మనిషికి నిజమైన ఆనందం లభిస్తుందని, ఇలాంటి అవకాశం ఎన్ఎస్ఎస్ ద్వారా రావడం విద్యార్థులకు గొప్ప అవకాశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఓలు ఉదయప్రకాశ్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్


మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి 22 : విద్యార్థులు సత్‌ప్రవర్తనతో విద్యను అభ్యసించి తద్వారా భావిభారత పౌరులుగా ఎదగాలని సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ సెక్రటరీ ఎస్. బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. గురువారం కడప నగరం చిన్నచౌకులోని గురుకుల బాలుర పాఠశాలను జడ్జి విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి పిల్లలు ఉంటున్న వసతి గృహాలను, వంటశాలలను, టాయిలెట్స్‌ను పరిశీలించారు. మధ్యాహ్న భో జన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాల పట్ల తగు జాగ్రత్తలు వహించాలని ఆధికారులను ఆదేశించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015 గురించి వివరించారు.

నూతన కార్యాలయం ప్రారంభం


గోవర్ధనరెడ్డిని సన్మానిస్తున్న సంస్థ డైరెక్టర్లు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 22: కడప నగరం ఆర్టీసీ బస్టాండు కేఎఫ్‌సీ ఎదురుగా ఉన్న మహాజనని చిట్స్ కడప ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయాన్ని రైల్వేస్టేషన్ రోడ్డు పూలంగళ్ల సర్కిల్ వద్దకు మార్చారు. ఈ కార్యాలయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సింగారెడ్డి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆదరాభిమానాలు పొంది ఉన్నతమైన సర్వీసు అందించాలని చిట్స్ డైరెక్టరుకు తెలిపారు. డైరెక్టర్లు పి.అమర్‌నాథరెడ్డి, ఎం.బాలక్రిష్ణ, ఎం.శివశంకర్‌రెడ్డి గోవర్ధనరెడ్డిని సన్మానించారు. సంస్థ ఏజెంట్లు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు శాపంగా మారిన పారిశుధ్యం

- టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి


మాట్లాడుతున్న శివకొండారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 22 : కడప నగరంలో ఇటీవల దోమల బెడద విపరీతంగా పెరిగిపోవడం వల్ల ప్రజలకు చిన్నారులకు దోమకాటు వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారని ఎక్కడ చూసినా మురికికాల్వలు చెత్తచెదారం పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ కడప నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డి ఆరోపించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దోమలు విపరీంతంగా నగరంలో పెరిగాయన్నారు. అనారోగ్యానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా తిలక్ నగర్, శాంతినగర్, ఖలీల్‌నగర్, గుర్రాలగడ్డ తదితర ప్రాంతాల్లో చెత్తచెదారం పేరుకుపోయి ప్రజలు తిప్పలు పడుతున్నారన్నారు. మేయర్ సురేష్‌బాబు స్పందించి అధికారులకు చెత్త తొలగించేందుకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి


ఉయ్యాలవాడకు నివాళులర్పిస్తున్న డీన్, అధ్యాపకులు, విద్యార్థులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 22: పట్టణంలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో ప్రథమ స్వా తంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ఘ నంగా నివాళులర్పించారు. గురువారం ఉయ్యాలవాడ వర్ధంతిని పురస్కరించుకొని ఆ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్.బేగ్, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీన్ మా ట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం తపాలాబిళ్ల ఆవిష్కరించిందని, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగాఏర్పడిన కర్నూల్ విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరుపెట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ ఆక్టివిటీ అధికారి డాక్టర్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కడప టూటౌన్ సీఐ బదిలీ

- టీడీపీ నేతలపై కేసు నమోదు చేయకపోవడమే కారణమా
- కొత్త సీఐగా ఇబ్రహీం

కడప (క్రైం), ఫిబ్రవరి 22 : కడప నగరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ తబరేజ్ కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరు టూటౌన్ సీఐగా పనిచేస్తున్న ఇబ్రహీం కడప టూటౌన్‌కు బదిలీ చేసినట్లు తెలుస్తుంది. కర్నూలు నుంచి వచ్చిన సీఐ తబరేజ్ అక్టోబరు 13న సీఐగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఇటీవల వైసీపీ కార్యకర్త, టీడీపీ కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవ పోలీసుస్టేషన్‌కు చేరింది. దీంతో పోలీసుస్టేషన్ ఎదుట వైసీపీ, టీడీపీ మధ్య వాగ్వివాదం సాగింది. దీంతో స్టేషన్ ఎదుట వైసీపీ నేతలు భైఠాయించి ఆందోళనకు దిగారు. టీడీపీ నేతలు 17 మందిపై కేసు నమోదు చేయాలంటూ సీఐపై వత్తిడి తేవడంతో ఆయన ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. వైసీపీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అయితే వైసీపీ నేతల వత్తిడికి లొంగకపోవడం టీడీపీ వారిపై కేసు నమోదు చేయకపోవడంతో ఆయనపై బదిలీ వేటు వేసినట్లు తెలుస్తుంది. బుధవారం రాత్రి బదిలీ కాగానే కడప వీఆర్‌లో రిపోర్టు చేసుకున్నారు.

వైసీపీ ఉప సర్పంచ్ పదవికి రాజీనామా

కమలాపురం రూరల్ , ఫిబ్రవరి 22 :కోగటం గ్రామ పంచాయతీకి చెందిన వైసీపీ పార్టీ ఉప సర్పంచ్ నాగప్రసాద్‌రెడ్డి తన ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. గురువారం రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ జ్యోతికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప సర్పంచ్‌గా ఉన్నప్పటికీ వైసీపీ నుంచి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. గ్రామ అభివృద్ధి కూడా నిధులు లేకుండా చేసి పంచాయతీ అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. వైసీపీ ప్ర భుత్వం విధానాలు నచ్చడంలేదని దీనికి తోడు ఎమ్మెల్యే రవీంద్రనాధరెడ్డి నిరంకుశ వైఖరికి ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నారని తెలిపారు.

అన్నదాతపై దాడి సహించరానిది: సీఐటీయూ

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 22 : కనీస మద్దతు ధరతో తమ పంటలను కొనుగోలు చేసేందుకు న్యాయపరమైన హామీ కోసం పోరాడుతున్న అన్నదాతపై జరిగిన దాడి సహించరానిదని సీఐటీయూ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఉద్యమంపై అణచివేతను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా దళితుల భూముల కబ్జా

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 22: వైసీపీ నేతల అండదండలతోనే యధేచ్ఛగా జిల్లాలోని దళితుల భూములు కబ్జాకు గురౌతున్నాయని అఖిలపక్ష దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. రాయలసీమ అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్ బందెల ఓబయ్య అధ్యక్షతన దళితులు- ప్రభుత్వం సంక్షేమ పథకాలు-సబ్ ప్లాన్ నిధులు అనే అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నాయకులు రెడ్డన్న, దళిత మిత్ర కైపు రామాంజనేయులు పాల్గొన్నారు.

పన్నుల పేరుతో ప్రజల నడ్డివిరిచిన జగన్



ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, కొండారెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, లింగారెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 22 : రాష్ట్ర ప్రజల మీద ఇంటి పన్నులు, బస్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శించారు. గురువారం మెయిన్ బజార్, గౌరమ్మ కట్టవీధి, కొప్పరపు సుబ్బరావు వీధులలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఈసందర్భంగా కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, రాజుపాళెం టీడీపీ మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నారాయణ, సత్యనారాయణ, కోటా రమేష్, కోటా నరసింహరావు, నటకల సతీష్ తదితరులు పాల్గొన్నారు,

వైసీపీ పాలన ప్రజల్లో నమ్మకం కోల్పోయింది : సీఎం సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 22: వైసీపీ పాలనలో ప్రజల్లో నమ్మకం కోల్పోయిందని టీడీపీ సీనియర్ నాయకుడు సీఎంసురేశ్‌నాయుడు విమర్శించారు. గురువారం మోడంపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, రాజుపాళెం మాజీ ఎంపీపీ శెట్టిపల్లె ప్రభాకర్‌రెడ్డి,టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, బండి విజయ భాస్కర్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది టీడీపీ ప్రభుత్వమే: ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 22 : రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెన్నానగర్ లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మౌనికారెడ్డి, హరితారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జవీవుల్లా, 22 వవార్డు కౌన్సిలర్ మహ్మద్ గౌస్, కమలాపురం మజీద్, షరీఫ్ బాబులొరెడ్డి తదితురులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు పెన్నానగర్ ప్రచారంలో పాల్గొన్న ప్రవీణ్‌రెడ్డి

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ నాయకురాళ్లు బొజ్జ అరుణ, మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు గౌరీశంకర్ నగర్, మార్తోమానగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి వివరించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, బుడిగి రామసుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటరమణ, నాగేశ్వర్‌రావు, జమ్మయ్య, శేఖర్, నారాయణ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాకారులచే అవగాహన

జమ్మలమడుగు ఫిబ్రవరి22:హెచ్ఐవీ ఎయిడ్స్‌పై కళాకారుల బృందం అవగాహన కల్పించారు.గురువారం జమ్మలమడుగు పట్టణంలోని సాయిపరమేశ్వర డిగ్రీకళాశాల,పాత బస్టాండులోని గాంధీ విగ్రహం సమీపాన ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌బాష మాట్లాడుతూ జమ్మలమడుగు ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో కళాకారుల బృందం చేత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేష్‌కుమార్, పుల్లయ్య,నాగేశ్వరరెడ్డి, శోభభారతి, సుమతి,శ్రీనివాసులు, జయశంకర్ కళాబృందం వారు ,ఆసుపత్రి సిబ్బంది,ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి వార్షికోత్సవం



ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 22: ఎర్రగుంట్ల ముద్దనూరురోడ్డులో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునుంచే అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. మధ్యాహ్నం అమ్మవారి ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు. రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి మహామంగళహారతినిచ్చారు. 36వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయానికి భారీగా వచ్చిన భక్తులకు కమిటీవారు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఉపాధ్యాయుల బిల్లులు చెల్లించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 22 : ప్రొద్దుటూరు ఉపఖజానా పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు, దువ్వూరు మండలాల ఉపాధ్యాయుల వేతనాల బిల్లులు, ఇన్‌కాంట్యాక్స్ రిటర్న్‌లను మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ఎస్‌టీఓ తిరుపతి స్వామికి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి నెల వేతన బిల్లులతో పాటు ఇన్‌కాంటాక్స్ రిటర్న్‌ల సమర్పణకు ఇబ్బంది లేకుండా బిల్లులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, కొండారెడ్డి, మోహన్‌రెడ్డి, ఆసీఫ్ హుస్సేన్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి

మైదుకూరు, ఫిబ్రవరి 22 : పట్టణంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి గురువారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారి 25వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నుంచి 10 రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి భక్తులు ఆకట్టుకునేలా ప్రత్యేక అలంకరణ చేపట్టి హోమాలు నిర్వహించి మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా గురువారం రాత్రి స్థానిక వాసవీ హైస్కూల్ విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కాగా మూడో రోజు శుక్రవారం అమ్మవారినిమహాలక్ష్మీదేవి అలకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

దిశచట్టం మహిళలకు రక్షణ కవచం

బద్వేలు, ఫిబ్రవరి22: దిశచట్టం మహిళలకు రక్షణ కవచంలాంటిదని మహిళా పోలీసు కల్యాణి తెలిపారు. వీరారెడ్డి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 సమన్వయకర్త ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గుంతపల్లెలో గురువారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా దిశచట్టం పైఅవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్య,హైమావతి తదితరులు పాల్గొన్నారు.


చెరువులను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

బద్వేలు, ఫిబ్రవరి22: మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేట చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, ఇటుక ఫ్యాక్టరీలు నిర్వహిస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు.గురువారం సుందరయ్య భవనంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కబ్జాదారులు చెరువులతో పాటు మోరీలు, వాగులను ఆక్రమిస్తున్నార ని, ఇళ్లనిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, మస్తాన్, నాగార్జున, బాలగుర్రయ్య, ఆంజనేయులు, ముస్తఫా,రాయప్ప, మోక్షమ్మ, బాలమ్మ , ఖైరున్ బీ తదితరలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన భూపేశ్



నారా చంద్రబాబుతో భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు,ఫిబ్రవరి 22: జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి గురు వారం రాత్రి హైదరాబాద్‌లోని చంద్ర బాబు నివాసంలో ఆయనను కలిశారు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రజల్లోకి వెళ్లాలని ఎన్నికల్లో జమ్మలమడుగులో టీడీపీ జెండా ఎగురవేయాలని చంద్రబాబు సూచించినట్లు భూపేశ్‌రెడ్డి తెలిపారు. దీంతో తనకు చాలా సంతోషం కలిగిందని భూపేశ్ తెలిపారు. జమ్మలమడుగులో టీడీపీ జెండా ఎగురువేయుటకు చంద్రబాబు సూచనలు, సలహాలు ఇచ్చారని భూపేశ్‌రెడ్డి తెలిపారు.

ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం



స్వామి విగ్రహ మూర్తులు

మైదుకూరు, ఫిబ్రవరి 22 : పట్టణ శివారులోని శ్రీనగరంలో పంచముఖ ఆంజనేయ స్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. కాగా 24న స్వామి వారి విగ్రహంతో పాటు నాగులు, నవగ్రహ మంటపం కూడా ప్రతిష్ఠించనున్నారు. సాయంత్రం స్వామి వారి విగ్రహ మూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గురువారం జరిగిన ఈ పూజా కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

భూకబ్జాదారులనుంచి బద్వేలుకు విముక్తి కలిగించాలి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 22 : బద్వేలు నియోజకవర్గంలో అరాచక శక్తులు భూకబ్జాదారులనుచి బద్వేలుకు విముక్తి కలిగించాలంటే జనసేన , టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని జనసేన పార్టీ బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త బసవి రమేష్ అన్నారు. గురువారం పోరుమామిళ్లలోని సీసీఆర్ ఫంక్షన్ హాలులో నాలుగు మండలాల జనసేన పోలింగ్‌బూత్ కన్వీనర్ల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆయన నియోజకవర్గ సీనియర్ నాయకుడు మురళీక్రిష్ణ మాట్లాడుతూ ప్రతి ఐదు పోలింగ్‌బూత్‌లకు ఒక బూత్ కన్వీనరును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలను స్వచ్ఛందంగా ఓట్లు వేయించేలా అందరూ కృషి చేయాలన్నారు. ప్రతి పోలింగ్‌బూత్ కన్వీనర్ల సలహాలు తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కారక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు నందకిశోర్, ఈశ్వర్‌రెడ్డి, కోటపాటి వెంకటేశ్, ఇమ్రాన్, రమణయ్య, శ్రీను, రఫి, నాగార్జున, అభిలాష్ ,తరుణ్, పాల్గొన్నారు.

ప్రధాన పంట కాల్వల్లో పూడికతీత



పోరుమామిళ్ల, ఫిబ్రవరి 22 : పోరుమామిళ్ల చెరువు కింద ఉన్న దాదాపు 400 ఎకరాల్లో వరి పంట వేసిన రైతులు నీరు అందక ఆందోళన చెందుతూ సమస్యను సర్పంచ్ యనమల సుధాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గురువారం పెద్దచెరువు ప్రధాన కాల్వలో యంత్రాలతో పూడికను చెరువు వద్ద నుంచి మల్లకతవ వరకు పూడిక తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీతావెంకటసుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ శెట్టెం ప్రతాప్, మాజీ ఉప సర్పంచ్ షరీఫ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

జమ్మలమడుగు ఫిబ్రవరి22:ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి సూచించారు.గురువారం జమ్మలమడుగు పట్టణంలో ఏపీ గురుకుల పాఠశాల,గూడెం చెరువులోని కస్తూర్బాగాంధీ విద్యాలయం బాలికలకు పదోతరగతి విద్యార్థులు పరీక్ష సామగ్రి అందజేశారు. మొత్తం 133 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించినట్లు తెలిపారు.

చలో అనంతపురం తరలివెళ్లిన జర్నలిస్టులు



ర్యాలీ చేస్తున్న జర్నలిస్టులు

బద్వేలు, ఫిబ్రవరి22: జర్నలిస్టులపై జరిగిన దాడులకు నిరసనగా రాష్ట్ర జర్నలిస్టు సంఘం పిలుపు మేరకు బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో చలో అనంతపురం నిరసన కార్యక్రమానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తరలివెళ్లారు. కాగా గురువారం ఉదయం మండలంలోని జర్నలిస్టులు తరలివెళ్లారు.

దీర్ఘవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ

మైదుకూరు, ఫిబ్రవరి 22 : స్థానిక బీజేపీ కార్యాలయంలో దీర్ఘవ్యాధిగ్రస్తులకు గురువారం పౌష్టికాహార పంపిణీ చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్‌మండలి వైద్యులు రవిబాబు చేతుల మీదుగా మందులతో పాటు పౌష్టికాహారాన్ని అందించారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయం అవుతాయని తెలిపారు.

సీమ ప్రజలకు ద్రోహం చేసిన సీఎం జగన్



మాట్లాడుతున్న సుంకర వేణుగోపాల్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 22 : రాయలసీమ బిడ్డగా చెప్పుకునే సీఎం జగన్ సీమ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్ విమర్శించారు. గురువారం స్థానిక బీసీ సెల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సొంత జిల్లాలో వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టును ఇంత వరకు ఎందుకు నిర్మించడానికి చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కడప ఉక్కు పరిశ్రమ ఏమైందని, డ్రిప్ ఇరిగేషన్‌ను ఎందుకు ఎత్తివేశారన్నారు. కర్నూలులో మెగా సీడ్ పార్కు, చిత్తూరులో అమర్‌రాజా, అనంతపురంలో జాకీ పరిశ్రమలు ఎందుకు తరలి పోయాయని అన్నారు. పట్టు రైతులకు రావాల్సిన రూ.4కోట్ల బకాయిలను ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కర్నూలులో న్యాయ రాజధాని ఏమైందన్నారు. వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు రాము నాయుడు, సుబ్బరాజు, మహేష్‌బాబు, గోమేధికం సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 22 : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని రేనాటి సూర్య చంద్రుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం కొర్రపాడు రోడ్డులో ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి , ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, కోటా ఓబుళరెడ్డి, వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి, కేశవరెడ్డి, పద్మవీరన్న, రామాంజనేయరెడ్డి, అంకాల్ కొండయ్య, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆప్కాస్‌లో కార్మికుల డేటా ఇబ్బందులు తొలగిపోతాయి



మాట్లాడుతున్న కల్యాణ్‌చక్రవర్తి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 22 : ఆప్కాస్‌లో వున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల డేటాలో వున్న ఇబ్బందులు అన్ని తొలగిపోతాయని ఆప్కాస్ డైరెక్టర్లు డాక్టర్ కల్యాణ చక్రవర్తి, భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ సభాభవనంలో ఔట్ సోర్సింగ్ కార్మికుల డేటాలో వున్న తప్పులను సవరించడానికి ఆప్కాస్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో వర్క్‌షాపు జరిగింది. ఈ వర్క్ షాపునకు కమిషనర్ మల్లికార్జున అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆప్కాస్ డైరెక్టర్లు మాట్లాడుతూ కార్మికుల డేటా ఎంట్రీలో పేర్లు భర్త,భార్య పేర్లు లేదా పుట్టిన తేది వయస్సులాంటివి తప్పులు నమోదు కావడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ పెట్టి వర్క్‌షాపులో సవరిస్తున్నమన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 45 మంది ఔట్ సోర్సింగ్ కార్మికుల డేటా తప్పులు సవరించామన్నారు. అలాగే ఈఎస్ఐ కార్డులు లేని వారికి 105 మంది దరఖాస్తులు స్వీకరించామన్నారు. అలాగే ఈపీఎఫ్ సకాలంలో జమ అవుతున్నదీ, లేనిదీ పరిశీలించామన్నారు.సమావేశంలో ఆప్కాస్‌మేనేజర్ డేనియల్ ప్రదీప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి అమానుషం



కలసపాడులో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు, జమ్మలమడుగులో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

కలసపాడు, ఫిబ్రవరి 22 : పాత్రికేయులపై దాడులు అమానుషమని కలసపాడు మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రంతు తెలిపారు. గురువారం ఆయన తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై, నిన్న కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడులు చేయడం పత్రికా స్వేచ్ఛను కాలరాయడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిశీలకుడు బిజివేముల రామచంద్రారెడ్డి, రామసుబ్బారావు, రోశిరెడ్డి, వెంకటయ్య, నారాయణరెడ్డి, భద్రయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: మీడియాపై దాడులు చేసిన ప్రోత్సహించిన వారిపై 307 సెక్షన్ కింద కేసులు నమోదు చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి డిమాండ్ చేశారు.గురువారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో ముఖ్యమంత్రి పత్రికల పేర్లు చెప్పి రెచ్చగొట్టడం వల్లే ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణను రచక్షణారహితంగా వైసీపీ గూండాలు దాడి చేశారన్నారు. మరుసటి రోజు కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై దుండగులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. గురువారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో పాత్రికేయులపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన విషయం మరువకముందే కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేయడం దారుణమని పేర్కొన్నారు. దాడులకు పాల్పడే వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు డేవిడ్ రాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.